క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : చందానగర్ సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో మాతృశ్రీనగర్, కల్వరి టెంపుల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.
- మాధవనగర్ ఫీడర్ పరిధిలో మాధవనగర్, మియాపూర్ ప్రధాన రోడ్డు కొంత ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- కల్యాణి గార్డెన్ ఫీడర్ పరిధిలో హైదర్‌నగర్ పెట్రోల్ పంప్, మెట్రో రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన వివరాంచారు.

బీజేపీ కార్యకర్తకు ఆర్థిక సహాయం



చెక్కు అందజేస్తున్న, రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీజేపీ కార్యకర్త అఖిల్‌కు బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ఆర్థికసాయం అందించారు. సోమవారం సన్నిహితుల ద్వారా విషయం తెలియడంతో కొండాపూర్‌లోని వారి కుటుంబసభ్యులకు రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మెడికవర్ ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, రాయదుర్గం వాసులు పాల్గొన్నారు.

బహుజన మేధావులపై దాడిని ఖండిస్తున్నాం

కూకట్‌పల్లి: మనుస్మృతికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని రక్షించే క్రమంలో ఆదివారం ఏజీ కార్యాలయంలో జరిగిన కాకర్యక్రమంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్ సతీష్ చందర్, ప్రజాకవి జయరాజ్, డీఐఎఫ్ నాయకులు, ఇతర ఎస్సీ సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసి రాత్రి వరకు ముషీర్‌బాగ్ ఇతర పోలీస్‌స్టేషన్‌లో ఉంచడం రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ పేర్కొన్నారు. దీనిపై బీజేపీ నాయకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హమారా ప్రసాద్ లాంటి దేశ ద్రోహులపై రాజద్రోహం కేసు పెట్టాలని మాల మహానాడు డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఇన్‌చార్జి ప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యదర్శి బిల్లం మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌లో అమ్మకానికి ఆవులు

ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలు చేసి టోకరా

శంషాబాద్ రూరల్: ఫేస్‌బుక్‌లో అమ్మకానికి పెట్టిన ఆవులను కొనుగోలు చేసేందుకు ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి మోసం పోయిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన సోనుకుమార్ అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో ఆవులను అమ్మకానికి పెట్టాడు. ఈ ఫొటోలను చూసిన చార్మినార్ ప్రాంతానికి చెందిన అనిల్ శర్మ మూడు ఆవులను రూ.59వేలకు కొనుగోలు చేసేందుకు సోనుకుమార్‌తో బేరం కుదుర్చుకున్నాడు. ఇందుకుగాను రెండు దఫాలుగా రూ.38వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఆవులను నగరానికి పంపేందుకు సోనూకుమార్ మరికొన్ని డబ్బులు డిమాండ్ చేయడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన శర్మ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న రవి

మైలార్‌దేవ్‌పల్లి: అర్ధ రాత్రి షికారుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు లారీ ఢీనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రోహిత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు చందానగర్ ప్రాంతానికి చెందిన రవి, తన స్నేహితురాలితో కలిసి సోమవారం తెల్లవారుజామున ఓల్డ్ కర్నూల్ రోడ్డు మీదుగా బైక్‌పై చందానగర్‌కు వెళ్తున్నారు. అదే సమయంలో దుర్గానగర్ నుంచి కాటేదాన్ వెళ్తున్న లారీ వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో రవికి తలకు తీవ్రగాయాలు కాగా అతడి స్నేహితురాలికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని కూకట్‌పల్లి రెమిడీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మురుగు నీరు చెరువులో కలుస్తున్న దృశ్యం



పైప్‌లైన్ల వద్ద చాంబర్ నిర్మించకుండా వదిలేసిన దృశ్యం

అసంపూర్ణం..అస్తవ్యస్తం

ముందుకు సాగని సుందరీకరణ పనులు

- మురుగుకుంటను తలపిస్తున్న కాయిదమ్మ కుంట చెరువు
- దుర్గంధంతో స్థానికుల అవస్థలు
- పైప్‌లైన్ జంక్షన్ వద్ద చాంబర్లు నిర్మించాలని వినతి
- పట్టించుకోని అధికారులు



చెరువులో గుర్రపు డెక్క

హఫీజ్‌పేట్ : జీహెచ్‌ఎంసీ ప్రత్యేక నిధులతో చెరువులు, కుంటల సుందరీకరణ పనులు చేపడుతున్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు చెరువులు సుందరీకరణ దాదాపు పూర్తికావచ్చిన మరి కొన్ని చెరువుల కనీసం పట్టించుకోవడం లేదు. కాయిదమ్మకుంట చెరువు పరిసరాల్లో పలు కాలనీలు, పెద్ద పెద్ద భవనాలు ఉన్నాయి. కానీ వారికి అందుబాటులో ఉన్న చెరువు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. చెరువులో మురుగు నీరు కలవకుండా ప్రత్యేకంగా మీదికుంట చెరువు నుంచి కాయిదమ్మకుంట చెరువు చుట్టూ పైప్‌లైన్ వేసినా చాంబర్లు నిర్మించలేదు. వినాయకచవితి, బతుకమ్మ పండుగల సమయంలో చెరువు కట్ట వద్ద హడావుడి చేసే అధికారులు చెరువులోని గుర్రపు డెక్కతో పాటు చెత్తను తొలగిస్తారు. పండుగల తర్వాత ఆవైపు కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఇప్పటికైనా చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు ఇవీ....

- కాయిదమ్మకుంట చెరువు చుట్టూ పైప్‌లైన్ వేసినా చాంబర్లు నిర్మించలేదు. దీంతో గేటెడ్ కమ్యూనిటి వాసులు దుర్గంధం సతమతమవుతున్నారు.
- చెరువులో గుర్రపు డెక్క పెరగడంతో దోమలు బెడద తీవ్రంగా మారింది.
- చుట్టు పక్కల కాలనీలు భారీగా పెరగడంతో వాటి నుంచి మురుగు నీరు చెరువులోకి వదిలేస్తున్నారు.
- కుంట పక్కనే స్క్రాప్ దుకాణం కారణంగా చెరువు పూడుకుపోతోంది.
- చుట్టు పక్కల కాలనీల్లో ప్రజలు దోమల కారణంగా విష జ్వరాల బారిన పడుతున్నారు.
- చెరువు కట్టపై ఇష్టానుసారం చెత్త చెదారం, వాహనాల పార్కింగ్ చేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- తూ తూ మంత్రంగా చెరువు చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు అధికారులు, ఆ తర్వాత దానిని పట్టించుకోవడం లేదు.

చేపట్టాల్సిన పనులివీ..

- చెరువులోకి మురుగు నీరు చేరకుండా ఏర్పాటు చేసిన ప్రత్యేక పైప్‌లైన్‌కు వెంటనే చాంబర్లు నిర్మించాలి.
- చెరువులో ఎంటమాలజీ సిబ్బందితో దోమల మందు నివారణ పిచికారీ చేయించాలి.
- సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.
- వాకింగ్ ట్రాక్ పనులు వేగవంతం చేయాలి
- ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి
- కట్టపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.
- చెరువులో ఉన్న చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.
- చెరువు పరిరక్షణ కోసం సిబ్బందిని నియమించాలి.
- చెరువులో భవన నిర్మాణాల వ్యర్థాలు వేయకుండా చూడాలి.

చాంబర్లు నిర్మించాలి..



కాయిదమ్మకుంట చెరువులో మురుగునీరు కలవకుండా పైప్‌లైన్ నిర్మించారు, కానీ చాంబర్లు నిర్మించలేదు. దీంతో దుర్గంధం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. చెరువులో చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరువు సుందరీకరణ త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– జంగం గౌడ్, జనప్రియనగర్

పైప్‌లైన్ పనులు పూర్తి చేస్తాం..



మీదికుంట చెరువు నుంచి కాయిదమ్మకుంట వరకు చెరువులో మురుగు నీరు కలవకుండా ప్రత్యేక పైప్ లైన్ నిర్మించాం. కానీ రెండు పైప్‌లైన్లు కలిసే వద్ద చాంబర్లు నిర్మించాలి. త్వరలోనే వాటిని నిర్మిస్తాం. సుందరీకరణ పనులు వేగవంతం చేస్తాం.

– శేషగిరిరావు, ఇరిగేషన్ డీఈ

'కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలం'

కూకట్‌పల్లి: బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు అనుకూలంగా లేదని.. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ అని సీపీఎం నాయకులు సోమవారం విమర్శించారు. పేదలకు అందించే 10 కేజీల బియ్యాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఒక వైపు ఆర్థిక సంక్షోభం మొదలవుతుంటే చిన్న వ్యాపారులకు కత్తిమీద సాములా ఉందన్నారు. పెద్ద వాహనాలకు ధరలు తగ్గించి చిన్న వాహనదారులైన ఆటో, కార్ల టైర్లు ధరలను పెంచి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆటో నాయకుడు మహేష్ విమర్శించారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనలో రూ.9లక్షల కోట్లు అప్పు చేశారని ఈ భారమంతా ప్రజలపై వేస్తున్నారని విమర్శించారు.

సీఎం మోసాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తున్నాం



కార్యక్రమంలో పాల్గొన్న మొవ్వా సత్యనారాయణ, బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రజాగోస – బీజేపీభరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం విజయ్‌నగర్‌కాలనీలో జిల్లా సెక్రటరీ విజిత్‌వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా బీజేపీ రాష్ట్ర నాయకులు మొవ్వా సత్యనారాయణ విచ్చేసి మాట్లాడుతూ.. కాలనీలో మురుగునీటి ప్రవాహంతో దుర్వాసన, మరుగుదొడ్లు, గ్రౌండ్ వాటర్, అస్తవ్యస్తమైన రోడ్లు ఇవేమీ సరిగ్గా లేని పరిస్థితి కనిపిస్తోందన్నారు. కనీసం పేదలు ఉండడానికి కూడా చోటు లేకుండా కబ్జాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

- నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారతదేశాన్ని అన్ని రకాలుగా ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ఉద్యమకారులను వాడుకొని లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఇప్పుడు దేశాన్ని దోచుకోవడానికి బీఆర్ఎస్ పార్టీగా పేరు మార్చారని విమర్శించారు. ముఖ్యమంత్రి మోసాలు, మాయమాటలు, ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడానికి ప్రజాగోస –బీజేపీభరోసా కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ విజిత్ వర్మ, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ సాహిత్ వర్మ, బూత్ అధ్యక్షులు వేణు, మధు, చందు, అశోక్, కృష్ణారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యానగర్ కాలనీలో బీజేపీ కార్నర్ మీటింగ్

మియాపూర్: చందానగర్‌లోని విద్యానగర్ కాలనీలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్రాల కార్నర్ సమావేశం నిర్వహించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కన్వీనర్ రాఘవేందర్‌రావు, రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, చందర్ రావు, గౌస్ , రమణకుమారి, రాధిక, శ్రీను, నర్సింహారావు, లింగం, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైనేజీ పనుల పరిశీలన

పటాన్‌చెరు: పట్టణంలో జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్న బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాకి చెరువు అలుగు ప్రారంభం నుంచి నక్క వాగు వరకు నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని తెలిపారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసి అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్



మాట్లాడుతున్న బండి సంజయ్

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారని, సీఎం కేసీఆర్ డిప్రెషన్‌లోకి వెళ్లి ఏది పడితే అది వాగుతున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. జహీరాబాద్ అసెంబ్లీ బర్దిపూర్ ఆశ్రమానికి వెళ్తున్న బండి సంజయ్‌ను సోమవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి రింగ్ రోడ్డు వద్ద బీజేపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మీడియాతో బండి సంజయ్ మాట్లాడుతూ.. అభివృద్ధి ఎజెండాతో బీజేపీ ముందుకు వెళ్తే, బీఆర్ఎస్ మోదీని తిట్టడం, కేంద్ర ప్రభుత్వాన్ని బదనాం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. బీఆర్ఎస్ నియంత పాలనను ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదని జోస్యం చెప్పారు. తెలంగాణ సెంటిమెంట్‌తో 1400 మంది ఉసురు పోసుకున్న పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్సేనని మండిపడ్డారు. శివరాత్రి పేరిట పటాన్‌చెరు ఎమ్మెల్యే హంగూ ఆర్భాటాలు చేసి సినిమా పాటలు పాడించి హిందూ ధర్మాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. అనంతరం బండి సంజయ్‌ను జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత నందీశ్వర్ గౌడ్, నాయకులు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాజు, గోపాల్ యాదవ్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి



మనూ జట్టు సభ్యులతో వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ అన్నారు. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నీకి ఎంపికైన క్రికెట్ జట్టు సభ్యులు సోమవారం వీసీని కలిశారు. ఈ సందర్భంగా వీసీ వారిని ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఆటల్లోనే రాణిస్తే భవిష్యత్‌లో మరింత గుర్తింపు వస్తుందన్నారు. క్రికెట్ టోర్నీలో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. బెంగళూరులోని రేవా యూనివర్సిటీలో జరగనున్న టోర్నీకి జట్టు సభ్యులు సోమవారం బయలు దేరి వెళ్లారు. ఎంపికైనవారిలో అహ్సన్, సాజిద్ మహమూద్, బషీర్ తాహెర్, సాకీబ్, సజాద్ అహ్మద్, మహ్మద్ హసన్, ఆరీఫ్ కలీమ్, తైబ్‌హుస్సేన్, బిలాల్, నౌషాద్, గోపి, యాసీన్, షెహ్వార్, ఎండీ అక్రమ్‌సిద్ధి ఉన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, డీపీఈ స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఏ కలీముల్లా, ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్, ఏడీ యాజ్దాన్ రిజ్వాన్ పాల్గొన్నారు. మహ్మద్ హమీద్ జట్టు కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు.

శాంతిసరోవర్‌లో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, కుల్‌దీప్‌దీదీ తదితరులు

రాయదుర్గం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో హెచ్‌సీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు, ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్ బీకె ఈవి గిరీష్, శాంతిసరోవర్ డైరెక్టర్ బీకె కుల్‌దీప్‌దీదీ, రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ హేమావతిరామస్వామి పాల్గొన్నారు. అనంతరం బ్రహ్మకుమారీస్ సంస్థ పతాకాలను చేతిలో పట్టుకుని ముగింపును లాంఛనంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 16 అడుగుల సువర్ణ శోభిత శివలింగాన్ని అందరూ ఆసక్తిగా తిలకించారు. ద్వాదశజ్యోతిర్లింగాల సందర్శన, మెడిటేషన్ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ యువకులకు వీవీఆర్ ఫౌండేషన్ సహకారంతో ఆయన వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య, సత్యనారాయణ, వెంకట్, వర్మ, భవనంద్, మల్లేశ్, రాజశేఖర్, గణేష్, నవీన్ పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జున స్వామి వసంతోత్సవం

పటాన్‌చెరు టౌన్: బీరంగూడ గుట్టపై శ్రీ భ్రమరాంబ మల్లికార్జున దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవంలో భాగంగా సోమవారం వసంతోత్సవంను ఆలయ ఇన్‌చార్జి ఈఓ శశిధర్, ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు తులసిరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి దేవతల విగ్రహాలను పల్లకిపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

వీడియా కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ నర్సింహారావు, తదితరులు

మియాపూర్: మియాపూర్‌లోని వీడియా కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐ తిరుపతిరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీ అసోసియేషన్, కాలనీ వాసులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలన్నారు. సీసీ కెమెరాలతో నేరాల సంఖ్య తగ్గుతుందని, నేరస్తులను త్వరగా పట్టుకునేందుకు అవకాశముంటుందన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, సాండ్విక్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్డ్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఏవీబీ పురంలోని కార్డ్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో మహిళలు స్వయం సమృద్ధి సాధించేలా వారికి వృత్తిపర కోర్సులు ఉచితంగా కల్పించడానికి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్డ్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు సుమన్ 25 సంవత్సరాల నుంచి ఎంతో మంది అనాథ పిల్లలను ఆదుకుంటున్నారని అన్నారు. మహిళలకు ఉపాధి కల్పించి వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు పెద్ద సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కూడా పొందవచ్చన్నారు. ఈ వృత్తివిద్య కోర్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏవీబీ పురంలో అనేక మంది నిరుపేదలు ఉన్నారని అందుకే ఈ ప్రాంతంలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తామని తెలిపారు. అదే విధంగా కరోనా వంటి కష్ట కాలంలో ఎంతో మంది నిరుపేదలకు నిత్యావసరాలను అందించి నిరుపేదలకు ఉపయోగపడుతున్నందుకు సంస్థ సభ్యుడు సుమన్ దంపతులను ఎమ్మెల్యే కృష్ణారావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, సీనియర్ నాయకులు హరినాథ్, ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

జాగరణ పేరుతో దేవుళ్లను కించపరచడం బాధాకరం

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత నందీశ్వర్ గౌడ్



మాట్లాడుతున్న నందీశ్వర్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: జాగరణ పేరుతో సినిమా పాటలు పాడించడం దేవుళ్లను కించపరచడమేనని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ అన్నారు. శివరాత్రి పేరిట కొందరు నాయకులు రాజకీయాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దీన్ని బీజేపీ ఖండిస్తుందన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు...కంటోన్మెంట్‌లో జరిగే ఉప ఎన్నికల్లో గెలిచేదెవరో మీరే చూస్తారన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే, అతడి సోదరుడు పాటి గ్రామ సమీపంలో అసైన్డు భూమిని, బీరంగూడ భ్రమరాంబికా మల్లికార్జున ఆలయ భూములు, రాములవారి భూమి విషయంలో అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బండి సంజయ్ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.

రేణుక ఎల్లమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ఫిబ్రవరి 24నుంచి మూడు రోజుపాటు ఎల్లమ్మ మహాజాతర అమ్మవారికి బోనాలు, ఉరేగింపుతో పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జాతర సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు హాజరై అమ్మవారి ఆశీస్సులు, ప్రసాదం తీసుకోవాలని కోరారు. రూ.25 లక్షలతో అమ్మవారికి చేయించిన బంగారు పాదాలు, చెవులు, ముక్కు ఆభరణాలను గవర్నర్ తమిళిసై అలకరింస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.